ప్రజాశక్తి

బుధవారం 12 మార్చి 2025

పార్వతీపురం మన్యం

ప్రయాణికుల సంక్షేమ లోగో ఆవిష్కరణ

పార్వతీపురం : జిల్లా ప్రయాణీకుల సంక్షేమ లోగోను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మంగళ వారం ఆవిష్కరించారు. జిల్లా ప్రయాణికుల సంక్షేమ సంఘం లోగోను రూపొందించింది. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బడే నాగభూషణ రావు, తోటపల్లి టెంపుల్ ట్రస్ట్ ట్రెజరర్ శ్రీరామచంద్ర మూర్తి, డి ఆర్ యు సి సి సభ్యులు శ్రీహరి, ఎఐ సాఫ్ట్ బ్రాండ్ ప్రతినిధి మణిభూషణ్ పాల్గొన్నారు.

లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పుర'పాలన' అస్తవ్యస్తం

- సమర్ధుడైన కమిషనర్ లేక చతికిలపడిన వైనం
- జీతాల కోసం సమ్మెకు దిగిన కార్మికులు
- పన్నుల వసూళ్లూ అంతంత మాత్రమే

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక పురపాలక సంఘంలో ఆలనాపాలనా లేని పరిపాలన కొనసాగుతోంది. వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగుల పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైంది. వేటగాడు మెత్తనైతే లేడి ఎన్ని గంతులైనా వేస్తుందన్న చందంగా ఉంది పురపాలక సంఘం తీరు. గత ఏడు నెలలుగా అభివృద్ధి మూడు అడుగుల ముందుకు, ఆరు అడుగుల వెనక్కి అన్న చందంగా కనిపిస్తోంది. రెండు నెలలుగా జీతాలు అందని పరిస్థితి ఏర్పడడంతో మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. సోమవారం నుంచి కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో వున్నారు. ప్రతినెలా జీతం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లు కూడా అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. కాంట్రాక్టు కార్మికుల జీతాలకు సరిపడే స్థాయిలో పన్నులు వసూలు జరగడం లేదు. దీంతో కార్మికులకు నెలనెలా జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. సమ్మె కారణంగా పట్టణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైంది. రెండు రోజులుగా పట్టణంలో చెత్తలు పేరుకుపోతున్నాయి.

సమర్ధుడైన కమిషనర్ లేక

గత ఏడు నెలలుగా మున్సిపాలిటీకి సమర్ధుడైన కమిషనర్ కొరత వెంటాడుతోంది. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చిన కమిషనర్ ప్రేమప్రసన్నవాణి బదిలీ అయిన తర్వాత కమిషనర్‌గా సిహెచ్.సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. వాస్తవంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా దృష్టి లోపం, స్వతంత్రంగా నిలబడలేని పరిస్థితి ఆయనకు ఉంది. కమిషనర్ పోస్ట్ మున్సిపాలిటీకి గుండెకాయ లాందిది. ప్రతి రోజూ వార్డుల్లో తిరిగి పారిశుధ్య పనులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంది. పట్టణ ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత ఆయనపై ప్రధానంగా వుంది. పారిశుధ్య కార్మికుల జీతాలకు ఇబ్బంది లేకుండా ఆస్తి, నీటి పన్నుల వసూళ్ల పై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. మరో వైపు ఉన్నతాధికారులు నిర్వహించే సమీక్ష సమావేశాలకు పూర్తి సమాచారంతో హాజరు కావాల్సి ఉంటుంది. కమిషనర్‌గా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టిన తర్వాత మున్సిపాలిటీకి సంబంధించిన ఈ పనులేవీ సక్రమంగా జరగలేదు. మున్సిపాలిటీ అభివృద్ధి కార్యకలాపాలకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల సమీక్ష సమావేశాల్లో నివేదించాల్సి పరిస్థితిలో ఇప్పుడు కమిషనర్ లేకపోవడంతో ఉన్నతాధికారులు ఆయన పట్ల అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. మున్సిపల్ డైరెక్టర్, రీజినల్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్లతో జరిగే వీడియో కాన్ఫరెన్స్ ల్లో సాలూరు మున్సిపాలిటీ తరపున నివేదించాల్సిన పరిస్థితిలో కమిషనర్ లేకపోవడంతో ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టు సాధించని చైర్ పర్సన్ పువ్వుల

మున్సిపాలిటీ పీఠంపై చైర్‌పర్సన్‌గా పువ్వుల ఈశ్వరమ్మ ఆసీనులై నాలుగేళ్లు గడిచాయి. అయినా ఆమె మున్సిపాలిటీపై ఇంకా పట్టు సాధించని పరిస్థితి కనిపిస్తోంది. ఆమె భర్త పువ్వుల నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా పురపాలనను సమర్ధవంతంగా నడిపించే పరిస్థితి లేకపోయింది. వైసిపి కౌన్సిలర్లతో సమన్వయం లేని కారణంగా ఆమె కుర్చీకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత పది నెలలుగా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మున్సిపల్ అధికారులు అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లో పని చేస్తున్న తీరు కనిపిస్తోంది.

మంత్రి ఇలాకాలో పూర్ పాలన

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తోంది. ప్రభుత్వంలో కీలకమైన మంత్రిగా ఉన్న సంధ్యారాణి తన సొంత నియోజకవర్గంలోని మున్సిపాలిటీ అభివృద్ధి దృష్టి సారిస్తారని అందరూ భావించారు. అయితే అందుకు భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏడు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్‌గా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన పరిస్థితిని చూసి మంత్రి అవాక్కయ్యారు. అస్తవ్యస్తంగా వున్న మున్సిపాలిటీకి ఇలాంటి కమిషనర్‌ని ఎలా నియమిస్తారని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన్ను సరెండర్ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ కమిషనర్ మార్పు గురించి ఆమె పట్టించుకున్న దాఖలాల్లేవు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు వారికి కావాల్సిన అధికారులను కమిషనర్లుగా తెచ్చుకున్న పరిస్థితి వుంది. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు అవసరమైన, సమర్ధులైన తహశీల్దార్లు, ఎంపిడిఒలను మంత్రి నియమించుకున్నారు. కానీ మున్సిపాలిటీ విషయంలో తనకు పట్టనట్లు వ్యవహరించడం చర్చనీయాంశమవుతోంది. పురపాలన అస్తవ్యస్తంగా మారుతున్నా ఆమె చూసీచూడనట్లు వ్యవహరించడంపై పట్టణ ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

రెండో రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

వాటర్, ఎలక్ట్రికల్ వర్కర్లు మద్దతు

సాలూరురూరల్ : తమకు చెల్లించాల్సిన పాత బకాయిలు వెంటనే ఇవ్వాలని, ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందించాలని, కార్మికుల ప్రాథమిక అవసరాలైన సబ్బులు, నూనెలు, పనిముట్లు సరఫరా చేయాలని డిమాండ్ చూస్తూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. మున్సిపల్ కార్మికుల నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతుగా మున్సిపల్ వాటర్ వర్కర్స్, ఎలక్ట్రికల్ వర్కర్లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వాటర్, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.సంతోష్, అమర్‌కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.శంకర్ కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికుల చేస్తున్న సమ్మెకు మున్సిపల్ పాలకవర్గమే బాధ్యత వహించాలని, పాలకవర్గం సమావేశపర్చి కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, పాలకవర్గం, అధికారులు కార్మికులు జీవితాలతో ఆటలాడుతున్నారని, చేసిన పనికి జీతాలను కూడా ఇవ్వకుండా కార్మిక కుటుంబాలను రోడ్డున పడేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, అధికారులు, పాలకవర్గం తీరు ఇలాగే ఉంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రవి, పోలరాజు, వెంకట్రావు, వెంకన్న, పెద్ద ఎత్తున మూడు సెక్షన్ల కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యా, వైజ్ఞానిక యాత్ర బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలకు వెళ్లే విద్యార్థులంతా తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆకాంక్షించారు. జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. విశాఖపట్నంలోని పర్యటించే ప్రాంతాల్లో కొత్త విషయాలను తెలుసుకొని విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకొని, భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలకు నాంధి పలకాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలానికి మూడు పాఠశాలలు చొప్పున జిల్లాలోని 45 మంది విద్యార్థులు ఈ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలకు బయలుదేరినట్లు డిఇఒ డాక్టర్ఎన్.తిరుపతి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఎవెన్యూ ప్లాంటేషన్ పెద్ద ఎత్తున చేపట్టాలి

అవెన్యూ ప్లాంటేషన్ పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. అటవీ శాఖ కార్యకలాపాలపై తన కార్యాలయంలో కలెక్టర్ సమీక్షించారు. రహదారుల వెంబడి, చెరువుల చుట్టూ ప్లాంటేషన్, గ్రామాల్లో చెట్ల పెంపకానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, సీడ్ బాల్స్ తయారీకి చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ, విఎస్-ఎస్‌ల ద్వారా ప్లాంటేషన్ పనులు చేపట్టాలని సూచించారు. జిల్లాలో చిత్తడి నేలల సరిహద్దులు, వాటి నోటిఫికేషన్‌పై సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అర్తం, నగరవాటిక వద్ద నగర వనాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినట్లు జిల్లా అటవీ అధికారి జిఏపి ప్రసూన తెలిపారు. పంట నష్ట పరిహారాన్ని విడుదల చేశా మన్నారు. సమావేశంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమిష్టి భాగస్వామ్యంతో స్వచ్ఛ సుందర పార్వతీపురం కావాలి

స్వచ్ఛ సుందర పార్వతీపురంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. స్వచ్ఛంధ్రా - స్వర్ణంధ్రా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ సుందర పార్వతీపురంపై కలెక్టర్ సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన ఛాంబరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా బుధవారం ఉదయం కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించాలన్నారు. ర్యాలీ అనంతరం అక్కడ సమావేశం నిర్వహించాలని, ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వచ్ఛంద, ఇతర సంస్థలు భాగస్వామ్యమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమష్టి భాగస్వామ్యం స్వచ్ఛ సుందర పార్వతీపురం సాధ్యమని, దీనిపై ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని చెప్పారు. ర్యాలీ, సమావేశానికి అవసరమైన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు బాధ్యతతో నిర్వర్తించాలని అన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డ్వామా పీడీ కె.రామ చంద్రరావు, మునిసిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, డీఎల్డీఒలు, అధికారులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

ప్రజాశక్తి - సాలూరు

ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు నిధులు కేటాయించాలని, తద్వారానే పట్టణాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి వీలవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.గంగు నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రజల సమస్యలపై అధ్యయన యాత్రలో భాగంగా సాలూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించింది. మక్కువ రోడ్‌లోని రైల్వే కాలనీ పేదల నివాసాల వద్ద ప్రజలుదేశించి గంగునాయుడు మాట్లాడారు. సాలూరు పట్టణంలో రైతు బజారు నిర్మాణం పూర్తయినా పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల నేటికీ వాడుకలోకి రాలేదన్నారు. దీనివల్ల నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నప్పుడల్లా ప్రజలు దోపిడీ గురవుతున్నారని చెప్పారు. పట్టణంలో ప్రధానంగా కాలువలు, మరుగు నీటి వ్యవస్థ పూర్తిస్థాయిలో లేదని చెప్పారు. దండిగా రోడ్డు, బంగారంపేట, కోట సెంటర్ ప్రాంతాల్లో మరుగునీటి కాలువలు మెరుగుకు సరిపడే నిధులను పాలకవర్గం కేటాయించాలని డిమాండ్ చేశారు. మక్కువ రోడ్‌లోని పేదల నివాసాలకు పన్నులు వేసి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రభుత్వ ఐటిఐ, లైబ్రరీ అద్దె భవనాల్లో ఉంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. సిపిఎం నికరంగా ప్రజాసమస్యలు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య యాత్రలో గుర్తించిన సమస్యలపై ఆందోళన నిర్వహిస్తామని, ఇందుకు ప్రజలంతా సిద్ధపడాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సిపిఎం సాలూరు పట్టణ కార్యదర్శి ఎన్‌వై నాయుడు, పాచిపెంట మండల కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు, సాలూరు పట్టణ సిపిఎం నాయకులు టి.ఈశ్వరరావు, భాస్కరరావు, మనోజ్, భారతి ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు గంగునాయుడు, ఎన్‌వై నాయుడు

13న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 13న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు బడే నాగభూషణరావు తెలిపారు. ఉచిత నేత్ర వైద్య శిబిరం కరపత్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విడుదల చేశారని ఆయన చెప్పారు. విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆవరణలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొంటారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంచాయతీల నిధులు పక్కదారి

ఎం-బుక్‌లో నమోదు చేయకుండానే బిల్లుల చెల్లింపులు

పంచాయతీ ఆపరేటర్ ఖాతాలోకి జమ

ప్రజాశక్తి - కొమరాడ

ఇటీవల పంచాయతీల ఖాతాలో జమైన 15వ ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టాయి. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టకుండా దుర్వినియోగం చేసినట్లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మండలంలో ఒక ఈ పంచాయతీకి చెందిన కంప్యూటర్ ఆపరేటర్ తన ఖాతాలో లక్షల రూపాయల నిధులు అన్ని పంచాయతీల నుంచి జమ కావడం పట్ల జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేని పంచాయతీ విస్తరణాధికారి నిర్వాకమే దీనికి కారణమంటూ అధికారులు అంటున్నారు.

మండలంలోని 31 గ్రామ పంచాయతీల కార్యదర్శుల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను ఎం-బుక్‌తో పాటు రికార్డుల్లో నమోదు చేసి సంబంధిత వెండర్‌కు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే ఇక్కడ అధికారుల పర్యవేక్షణా లోపం వల్ల ఆ నిధులను పూర్తిస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఇఒపిఆర్‌డి, ఓ కంప్యూటర్ ఆపరేటర్ కలిసి పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏకంగా పంచాయతీలకు సంబంధించి రెండేళ్లలో జరిగిన అభివృద్ధి పనుల పేరిట సుమారు రూ.20 లక్షల వరకు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధిక సంఖ్యలో ఆయా పంచాయతీల్లో శానిటేషన్, మంచినీటి సరఫరా ఇలా చిన్నచిన్న పనుల కోసం వచ్చిన నిధులను ఒక కంప్యూటర్ ఆపరేటర్ తన ఖాతాలోకి గత రెండేళ్లుగా జమ చేస్తూ వచ్చిన డబ్బులను అందరూ కలసి సర్దుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో ఆర్తాం, చినఖెర్జిల, చోళ్లపదం, దళాయిపేట, దోవుకొన, దుగ్గి, గంగరేగువలస, గుమడ, గుణద తీలేసు, గుణానపురం, కంబవలస, కెమిశీల, కొట్టు, కుంతేసు ,మాదిలింగి, మసీమండ, పాలెం, పెద శాఖ, పుడేడు, శివినీ, తొడుము, వన్నం పంచాయతీల నుంచి 2023-24లో కల్లికోట పంచాయతీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఒక మహిళ అకౌంటుకు రూ.5,83,493 జమైనట్లు రికార్డుల్లో తేలింది. 2024-25 ఏడాదికి సంబంధించి పైనున్న ఆయా పంచాయతీల్లో రూ.11.77354 సొమ్ము ఈ పంచాయతీ ఆపరేటర్ ఖాతాలో జమైనట్లు రికార్డుల్లో నమోదైంది. ఏకంగా ఒక పంచాయతీకి చెందిన ఆపరేటర్‌కు అన్ని పంచాయతీల నిధులు వ్యక్తిగత ఖాతాకు జమ కావడంపై పలు అనుమానాలకు దారితీస్తుంది.

పంచాయతీలో పనులు జరగకుండా భారీ మొత్తంలో పనులు జరిగినట్లు తప్పుడు రికార్డులు చేసి నిధులు స్వాహా చేసుంటారని ఆరోపణలు వస్తున్నాయి. పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులకు ఎటువంటి బిల్లులు చెల్లింపులు చేయాలన్న ఆయా పంచాయతీ కార్యదర్శుల వద్ద ఉన్న డిజిటల్ కీ ఒక కాంట్రాక్టర్ ఉద్యోగైన ఆపరేటర్ వద్ద ఉంచుతూ నిర్లక్ష్యంగా ఇన్ని రోజులు పనులు చేయించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై ఇప్పటికే గత రెండు రోజులుగా మండలంలో చర్చ జరుగుతోంది. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఈ అవినీతిపై స్పందించి దుర్వినియోగమైన నిధులను పూర్తిస్థాయిలో రికవరీ చేసి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై ఎంపిడిఒ మల్లికార్జునరావు, పంచాయతీ విస్తరణ అధికారి రాధాకృష్ణను పజాశక్తి వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, అధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మన్యంలో జ్వరాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మన్యంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రజలు మలేరియా, వైరల్ వంటి విష జ్వరాల బారినపడి భద్రగిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒకేసారి ఎక్కువ మొత్తంలో విషజ్వరాలు వ్యాపించడంతో ఆసుపత్రిలో రోగుల సంఖ్య అధికంగా పెరగడంతో మంచాలు చాలక ఒకే మంచంపై ఇద్దరి, ముగ్గురికి వైద్యం అందిస్తున్నారు. రోజుకు 200 నుంచి 250 మంది వరకు రోగులు వైద్యం కోసం వస్తున్నారు. 50 పడకల ఆసుపత్రిగా పెంచిన బెడ్లు మాత్రం 35 వరకు మాత్రమే ఉండడంతో రోగులకు చాలని పరిస్థితి. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే పూర్తిస్థాయిలో రోగులకు సేవలందించడానికి వీలుంటుందని వైద్యులు రౌతు రవికుమార్ తెలిపారు. రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

తాడికొండలో పర్యటించిన మలేరియా అధికారి

మండలంలోని తాడికొండ గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి రామచంద్రరావు మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. జ్వర లక్షణాలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. దోమల లార్వాను పరిశీలించారు. ఇంటింటికీ జరుగుతున్న స్ప్రేయింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంటిఎస్ జి.కేశవరావు, సూపర్వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఉన్నారు.

భద్రగిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విడివికెలు వృద్ధి చెందాలి : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలోని విడివికెలు (వన్ ధన్ వికాస కేంద్రాలు) వృద్ధి చెందాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. మంగళవారం తన చాంబారులో విడివికెల నిర్వహణ, యంత్రాల కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడివికెల ఉత్పత్తులు పెంచేలా అవసరమైన యంత్ర సామాగ్రిని వారికి సమకూర్చాలని అన్నారు. అలాగే వాటిపై తగిన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. విడివికెల ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో పాటు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎపిడి, 8 మండలాల ఎపిఎంలు, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడుల నిర్మూలన సామాజిక బాధ్యత : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పిల్లలపై లైంగిక దాడుల నిరోధానికి సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం నిర్వహించిన ఓరియన్టేషన్ శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పిల్లలకు మంచి చెడులను వివరించడం, పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవడం మనందరి బాధ్యత అని, అటువంటి చర్యలకు పాల్పడిన వారికి చట్ట ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. బాల్యం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నైతిక విలువలు, సామాజిక అంశాలను నేర్పుతూ, అనైతిక చర్యల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని సూచిం చారు. క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్ర మాలు చేపడుతూ పోక్సో చట్టం, పలు రకాల చట్టపరమైన శిక్షలపై, మంచి, చెడు స్పర్శలపై, లైంగిక దాడులు జరగకుండా పిల్లల రక్షణకు తోడ్పడే అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డిఇఐసి నుంచి చైల్డ్ సైకాలజిస్ట్ ఉదయకుమార్ శిక్షణ ఇస్తూ పిల్లలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణకు తీసుకో వాల్సిన అంశాలపై పవర్ ప్రెజెంటే షన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పద్మావతి, ప్రోగ్రాం అధికారులు జగన్మోహన రావు, రఘు కుమార్, సిడిపిఒ శ్రీనివాసరావు, ఎంఇఒ, ఇంటర్ బోర్డు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, ఎన్జీఓ పాల్గొన్నారు.

ఉన్నతి రుణాలను రికవరీ చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఉన్నతి పథకం ద్వారా డ్వాక్రా సంఘాల్లోని సభ్యులకు ఇచ్చిన ఉన్నతి రుణాలను వెంటనే రికవరీ చేయాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎపిఎం, సీసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఉన్నతి రుణాల రికవరీ చాలా పెండింగ్ ఉందని, కావున రికవరీ వేగవంతం చేయాలని అన్నారు. 7 టిపిఎంయు మండలాల పరిధిలో రూ.7 కోట్ల 67 లక్షలు రికవరీ పెండింగ్‌లో ఉందని, అందులో సీతంపేట మండలంలో రూ.3 కోట్ల 22 లక్షలు రికవరీ పెండింగ్‌లో తెలిపారు. రుణాలు చెల్లించని లబ్ధిదారులపై ఆర్ఆర్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే విడివికెలను బలోపేతం చేయాలన్నారు. వీడీవీకేలకు వచ్చే నిధులను సభ్యులకు ఉపయోగపడేలా ఖర్చు చేయాలన్నారు. బుక్ కీపింగ్ వర్క్‌ను పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎపిడి సన్యాసిరావు, డిపిఎం రమణ, అన్ని మండలాల ఎపిఎంలు, సీసీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ముంపు గ్రామాల్లో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం గదబవలస, బాసంగి ముంపు గ్రామాల్లో అడవి ఏనుగులు సంచరిస్తున్నాయి. మూడు రోజులుగా పై గ్రామాల్లో అడవి ఏనుగులు తిష్ట వేయడంతో సమీప గ్రామాల్లోని ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి అడవి ఏనుగులను తరలిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటనలు చేసినా, ఆచరణలో మాత్రం కానరాలేదు. ఇంకెంతకాలం ఏనుగులతో భయాందోళన చెందాల్సి వస్తోందనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు మరమ్మతులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

క్రాష్ పోగ్రామ్‌ను పరిశీలించిన పిఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బాలకృష్ణాపురంలో చేతిపంపుల మరమ్మతులను (క్రాష్‌ప్రోగ్రాం) ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారించే భాగంగా చేతిపంపుల మరమ్మతులను పూర్తి చేయాలని, తాగునీరు ఏ స్థాయిలో ఉందని తెలుసుకోవడం వంటి వివరాల అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో ఇంటింటి కొళాయిల కోసం వాటర్ స్కీముల కోసం అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ కుమార్ మాట్లాడుతూ 456 చేతిపంపులు ఉన్నాయని, 41 పిడబ్ల్యు స్కీం, 11 ఎంపీడబ్ల్యుఎస్, 2 పిడబ్ల్యు స్కీములు మండలంలో ఉన్నాయని పిఒకు వివరించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కృష్ణ, సత్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రాష్‌ప్రోగ్రాం వ్యానును ప్రారంభిస్తున్న ఎంపిపి ప్రమీల

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి - పాచిపెంట

వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపిపి బి.ప్రమీల, మండల ప్రత్యేక అధికారి వి.రాధాకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం వారు క్రాష్ ప్రోగ్రాంను ప్రారంభించారు. మండలంలో క్రాష్ ప్రోగ్రాం 45 రోజులు జరుగుతుందని, ఈ కార్యక్రమం ద్వారా మండలంలో అన్ని హ్యాండ్ బోర్లు, తాగునీటి పథకాలను పరిశీలించి మరమ్మతులు చేసి మండలంలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బివిజె పాత్రో, నాయకులు పి.వీరమనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ డి ఇ రామాంజనేయులు, ఎఇ ఆర్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి కోసం భూములిచ్చిన రైతులు వారి పొలాలకు వెళ్లడానికి వీల్లేకుండా అధికారులు చేపడుతున్న సైడ్ వాల్ నిర్మాణం ఆపాలని, సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఈనెల 1న మండలంలోని గురువునాయుడుపేట వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు తహశీల్దార్ బి.రవి స్పందించి మంగళవారం హైవే రోడ్డు పనులను పరిశీలించారు. విషయం తెలుసుకున్న రైతులు ఆకులవలస గోపి, కె.వసంతరావు, టిడిపి నాయకులు ముఖి సూర్యనారాయణ, సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు తహశీల్దార్‌ను కలిసి సమస్యను వివరించారు. హైవేకు భూములిచ్చిన రైతులకు తమ పొలాలకు వెళ్లడానికి అవకాశంలేని పరిస్థితి పట్ల గతంలో హైవే అధికారులకు, కలెక్టర్కు, రైతులకు అవగాహన కల్పించకపోవడం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు పంటలను తరలించేందుకు సర్వీస్ రోడ్డును వేసి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని కోరారు. రహదారి మొత్తం సైడ్ వాళ్లను పరిశీలించిన తహశీల్దార్ మాట్లాడుతూ ఈ సమస్యను తక్షణమే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌లో మంగళవారం జరిగిన వారపు సంతలో నీలకంఠాపురం ఎస్సై ఎ.నీలకంఠారావు సంతను సందర్శించి గిరిజనుల జీవన విధానం గూర్చి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన ప్రజలకు రహదారి భద్రత నియమాలు, గిరిజన చట్టాలు, సైబర్ క్రైమ్ నేరాలు, మహిళా భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ విధిగా ధరించి, మద్యం సేవించకుండా వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సైలు వై.రామాంజనేయులు ఎస్‌కె నజీమా, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలో వీరేష్‌చంద్రదేవ్‌కు సమస్యలను విన్నవిస్తున్న ప్రజలు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ అన్నారు. మండలంలోని కొండబారిడి, మొండెంఖల్, చప్పగొత్తిలి, ఆరిక కోరిడి గ్రామాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల నిర్మాణం జరుగుతున్న ప్రహరీ గోడలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రహదారి, తాగునీరు, విద్య, వైద్యం మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, మాజీ జిల్లా కోర్సులు సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, మాజీ సర్పంచులు బి.పద్మావతి, బి.మంజువాణి, టిడిపి నాయకులు మంతిన త్రిపురనాథ్, రామకృష్ణ, బి.యువరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతకు తిలోదకాలు

నెల రోజులకే తేలిపోయిన పిక్కరాయి

ప్రజాశక్తి - వీరఘట్టం

రాయిపిక్కలు తేలిపోయిన రోడ్డు

మండలంలోని సిఎస్‌పి రహదారి నుండి ఎం.రాజపురం మీదుగా కత్తుల కవిటి వరకు రూ.2కోట్ల అంచనా వ్యయంతో ఉపాధి హామీ నిధులతో ఐటిడిఎ ఆధ్వర్యంలో చేపట్టిన బిటి రోడ్డు పనుల్లో నాణ్యత లోపించడంతో ఎక్కడికక్కడ పిక్కరాయి తేలియిపోయింది. పనులు జరిగిన సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేపట్టడంతో పనుల్లో నాణ్యత లోపించిందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు దగ్గరుండి పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు లేకపోవడంతో కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రోడ్డు పనుల్లో నాణ్యత లేదు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనంగా బూడిదలో పోసిన పన్నీరులా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

మడ్డువలస కుడికాలువలో దూకి

తల్లీపిల్లలు ఆత్మహత్యాయత్నం

- తల్లి, కుమారుడిని కాపాడిన స్థానిక యువకుడు
-గల్లంతైన బాలిక.. ముమ్మరంగా గాలింపు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని మడ్డువలస కుడి ప్రధాన కాలువలోకి దూకి ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం మధ్యాహ్నం ప్రాజెక్టు ప్రధాన కాలువ హెడ్ స్లూయిస్‌కు దిగువ భాగంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బలిజిపేట మండలం గంగాడకు చెందిన కళింగ శ్రావణి(30), తన తొమ్మిదేళ్ల కుమారుడు సిద్ధు, ఏడేళ్ల కుమార్తె సైనీతో కలిసి కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసమయంలో అటువైపు చేపల వేటకు వెళ్తున్న సంగాం గ్రామానికి చెందిన జన్ని జగన్మోహన్ అనే యువకుడు వారిని చూసి వెంటనే కాలువలో దూకి శ్రావణిని, బాలుడు సిద్ధును కాపాడి ఒడ్డుకు చేర్చాడు. వెంటనే వంగర పోలీసులకు సమాచారమి చ్చాడు. అప్పటికే కాలువలో కొట్టుకు పోయిన బాలికను కాపాడే ప్రయత్నం చేస్తుండగా... ఒడ్డుకు చేర్చిన మహిళ శ్రావణి తన కుమారుడిని తీసుకొని మళ్లీలో నీళ్లలో దూకింది. జగన్మోహన్ మళ్లీ వారిని రక్షించాడు. ఆ ప్రయత్నంలో బాలిక గల్లంత య్యింది. వీరిని రెండోసారి రక్షించే ప్రయత్నం లో బాలికను రక్షించలేకపోయా నని యువకుడు జగన్మోహన్ తెలిపాడు. భారీ లోతు ఉన్న కాలువలో తన ప్రాణాలను సైతం లెక్కచేయ కుండా నీళ్లలో దూకి తల్లీ, కుమారుడిని కాపాడిన జగన్మోహన్‌ను గ్రామస్తులు అభినందించారు.

గల్లంతైన సైనీ ఆచూకీ కోసం గాలిస్తున్న మత్స్యకారులు

ప్రాణాలతో బయటపడ్డ తల్లీ కొడుకు

వంగర మండలం కింజంగికు చెందిన గుంట తవుడు, కళావతి రెండో కుమార్తె శ్రావణి బలిజిపేట మండలం గంగాడయిఅ చెందిన కళింగ సుధాకర్‌ను పదేళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. వీరికి సిద్ధు, సైనీ పుట్టిన తరువాత సుధాకర్ మానసిక స్థితి కోల్పోయాడు. పైగా వారిద్దరి మధ్య సఖ్యత లేకపోవడంతో శ్రావణి కింజంగిలో ఉన్న తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. కుమారుడు సిద్ధు ఉంగరాడ మెట్టవద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ఐదో తరగతి చదువుతుండగా, సైనీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. మూడు రోజుల క్రితం గరుగుబిల్లి మండలం బురద వెంకటాపురంలోని బంధువుల ఇంటికి పిల్లలతో కలిసి వెళ్లిన శ్రావణి తన కుమారుడిని పాఠశాలకు తీసుకెళ్తున్నట్లు బంధువులకు చెప్పి మడ్డు వలస ప్రధాన కాలువ వద్దకు తీసుకెళ్లి ఆత్మహత్యాయ త్నానికి పాల్పడింది. ఆర్థిక సమస్యలు వల్లే ఆత్మహత్యాయత్నం చేసుకొని ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ ధర్మరాజుతో పాటు రాజాం అమ్మవారి జాతర బందో బస్తులో ఉన్న ఎస్ఐ షేక్ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాజెక్టు అధికారులకు సమాచారం ఇచ్చి కాలువ హెడ్ స్లూయిస్ గేట్లు మూసివేయించారు. గత ఈతగాళ్లు, మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రిసమయం కావడంతో కొనసాగించేందుకు ఇబ్బంది పడ్డారు.

సెరీకల్చర్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వం సూచించిన మేర జిల్లాలో ప్రతి ఏడాది ప్రాథమిక రంగాలు వృద్ధి సాధించాలని, ఆ దిశగా ప్రణాళికలు చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రాథమిక రంగాల వృద్ధిపై సంబంధితశాఖల అధికారులతో కలెక్టర్ మంగళవారం తన సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సేంద్రియ వ్యవసాయం ఎక్కువగా జరుగుతుందని, కావున సేంద్రియ పంటల రైతులను ప్రోత్సహించాలని అన్నారు. నిమ్మగడ్డికి మంచి గిరాకీ ఉందని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఏటా 15 శాతంకు మించి వృద్ధి ఉండాలని తెలిపారు. పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ఉద్యాన వన పంటలు ఎక్కువగా పండించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మత్స్య సంపద వృద్ధికి జిల్లా అనుకూలమని, 58 శాతం నీటి వనరులు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం 70 లక్షల పెంపకం మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక రంగాలపై సంబంధిత అధికారులు మరింత వృద్ధి సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సెరికల్చర్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. సెరికల్చర్ కు మంచి అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. సేరికల్చర్ క్లస్టర్ లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశాలు పరిశీలించాలని, తద్వారా ప్రజల్లో ప్రాచుర్యం పొందగలరని చెప్పారు. మంచి లాభదాయక పంట అన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, బి శ్యామల, వి.తిరుపతయ్య, ఎ.వి.సాల్మన్ రాజు, డా.ఎస్.మన్మధరావు, ,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్పారావు కుటుంబ ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - పార్వతీపురం

అప్పారావు కుటుంబ ఆచూకీ లభ్యమైందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం అప్పారావు కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలిశారు. పార్వతీపురానికి చెందిన అప్పారావు 20 ఏళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటూ, తమిళనాడుకు చెందిన అన్నాదురై దగ్గర గొర్రెల కాపరిగా పనిచేస్తున్నట్లు తమిళనాడు కార్మిక శాఖ అధికారులు గుర్తించారని చెప్పారు. అయితే అప్పారావు చెబుతున్న ప్రాంతం ఒడిశా సరిహద్దులో ఉన్నట్లు ఆయన చెపుతున్న వివరాలు ఆధారంగా తెలిసిందని పేర్కొన్నారు. ఈ మేరకు రెవిన్యూ, ఇతర శాఖల అధికారులు వాటిని పరిశీలించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అప్పారావు కోరాపుట్ జిల్లా బంధుగాం బ్లాక్ పెద వల్లాడ పంచాయతీ చిన వల్లాడ గ్రామానికి చెందిన వ్యక్తిగా కుటుంబ సభ్యులు తెలిపారని చెప్పారు.

అనర్హుడైన అధ్యాపకుడ్ని తొలగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సీతానగరం మండలం జోగింపేట గిరిజన గురుకుల ప్రతిభ పాఠశాలలో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న బి.అవినాష్‌కు పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీ జీ) మాత్రమే ఉందని, బిఇడి లేని కారణంగా ఆయన్ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ ఉపాధ్యాయ, అధ్యాపక నియామకపు మార్గదర్శకాల ప్రకారం జూనియర్ లెక్చరర్ (నాన్ -లాంగ్వాజ్)కు పిజితో పాటు బిఇడి కూడా ఉండాలని తెలిపారు. ఈ మేరకు కలెక్టర్‌కు, ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు చేసినట్లు రంజిత్ కుమార్ వివరించారు.

తోటపల్లి నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వాలి

ప్రజాశక్తి - కురుపాం

తోటపల్లి నిర్వాసితులకు ప్యాకేజ్ ఇవ్వాలని మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. గరుగుబిల్లి మండలంలో తోటపల్లి ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, నిర్వాసిత గ్రామాలైన బాసంగి, దుగ్గి, బిత్రపాడు, మార్కొండపుట్టి, గుణానపురం, కళ్లికోట, గిజబ తదితర గ్రామాల్లో కొందరికి ప్యాకేజీ అందలేదని అసెంబ్లీ వేదికగా మంత్రిని కోరారు. వర్షాకాలంలో అయితే నిర్వాసిత గ్రామాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని, అలాగే కురుపాం మండలం తిత్తిరిలో హుదూద్ తుఫానుకు ఇళ్ల రేకులు ఎగిరిపోయి పాడైపోయావని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వనమిత్ర ఎఫ్‌పిఒను సన్మానిస్తున్న ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు

'ఆర్ట్స్' ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి -సీతంపేట

ఆర్ట్స్ సంస్థ నిర్వహిస్తున్న మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా ఆదివాసీ మహిళా వనమిత్ర ఎఫ్‌పిఒలుగా పనిచేస్తున్న శంభాం పంచాయితీ బుడ్డడుగూడ, తాలాడ గ్రామాల్లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళా హక్కులు, వారి అభ్యున్నతి కోసం ఏవిధంగా పనిచేయాలన్న అంశంపై అవగాహన కల్పించారు. మహిళా రైతులు ఆర్థికంగా బలపడ్డానికి ఆదివాసీ మహిళా ఎఫ్‌పిఒతో కలిసి పనిచేయడం, విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మహిళలు పీసా గ్రామ సభల్లో ఉత్సాహంగా పాల్గొని సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించాలని తెలిపారు. ఆర్థిక, సామాజికంగా బలపడ్డానికి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆడలి వ్యూ పాయింట్ చూడ్డానికి వచ్చే పర్యాటకులు దృశ్య మహిళా రైతులంతా కలిసి ఆదివాసీ వ్యవసాయ ఉత్పతులు, సంప్రదాయ వంటలు, హస్తకాల ఉత్పత్తులు విక్రయించడానికి ఆదివాసీ వికాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో శంభం సర్పంచ్ నిమ్మక తిరుపతి, వనమిత్ర ఎఫ్‌సిఒ సిఇఒ కె.పద్మ, ఆదివాసీ మహిళా ఎఫ్‌బిఒ సిఇఒ ఆరిక గౌతమి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ లాభాల సందీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుడ్డుఖల్లులో ...

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని దుడ్డుఖల్లులో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా దుడ్డుఖల్లు పిహెచ్‌సి వైద్యాధికారిణి బివిఎస్ స్వాతి పాల్గొన్నారు. మహిళలకు ఉన్న హక్కులు గురించి తెలుసుకుని ఇంకా చైతన్యం కావాలని, కుటుంబ ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తలు తీసుకుని మహిళా సాధికారితా దిశగా ముందుకు అడుగులు వేయాలని అన్నారు. మహిళా సర్పంచులను సన్మానించారు. కార్యక్రమం లో దుడ్డుఖలు సర్పంచ్ నీలావతి, బాలేసు సర్పంచ్ కళావతి, గిరిజన జెఎసి నాయకులు సింహాచలం, ఆర్ట్స్ సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ సూర్యం, సిపిఎం నాయకులు తిరుపతిరావు, మహిళలు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన నేడు 'యువత పోరు'

ప్రజాశక్తి -భామిని

రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదల, నిరుద్యోగ భృతి అమలు, కొత్తగా ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాలల్లో ప్రైవేటీకరణ నిలిపివేయాలని కోరుతూ వైసిపి రాష్ట్రం వ్యాప్తంగా బుధవారం తలపెట్టిన యువత పోరు కార్యక్రమం యువత పెద్దఎత్తున పాల్గొనాలని వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బత్తిలిలో యువత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట లాలు ప్రసాద్, పట్నాయక్, అశోక్ ఉన్నారు.

సాలూరు: జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించనున్న ఫీజు పోరు ధర్నాకి మండలం లోని నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు జడ్పీటీసీ లు హాజరు కావాలని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్,జెడ్పీ వైస్ చైర్మన్ కొర్రజన్ని సింహాచలం, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు కోరారు. మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసంలో ఫీజు పోరుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచులు రొంగలి లక్ష్మణరావు,సూరప్పలనాయుడు, సాంబమూర్తి పాల్గొన్నారు.

పాచిపెంట : ఈ నెల 12న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరుకు సంబంధించిన గోడపత్రికను ఎంపిపి బి.ప్రమీల స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైసీపీ నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12న నాయకులు, యువత కలెక్టరేట్ ర్యాలీకి సిద్ధమవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు గొట్టాపు ముత్యాలనాయుడు, నాయకులు పి.వీరంనాయుడు. ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, కొల్లి రవీంద్ర, మీసాల చంటి. సర్పంచులు. ఇజ్జాడ అప్పలనాయుడు. సిహెచ్ సీతారామకృష్ణ, బి.వీరయ్య, పెద్దిబాబు, నారాయణరావు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం : యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు ఆధ్వర్యాన పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో జడ్పీటీసీ మామిడి బాబ్జీ, ఎక్స్ సిడిసి చైర్మన్ నడిమింటి రామకష్ణ, రైతు విభాగం అధ్యక్షులు ఆర్వీ, జిల్లా పార్టీ కార్యదర్శులు బుడితి ముకుంద, పి శంకరరావు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : యువత పోరు పోస్టర్ స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ ఆధ్వర్యాన నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురంలో బుధవారం జరగనున్న యువత పోరు కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత, వైసిపి శ్రేణులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో జడ్పిటిసి అలజంగి రవికుమార్, ఎంపిపి గుడివాడ నాగమణి, వైస్ ఎంపిపి వెలిది సాయిరాం, జిల్లా ఇంటలెక్చువల్ ఫారమ్ అధ్యక్షులు పిఎస్ఆర్ నాయుడు, రాష్ట్ర దాసరి కార్పొరేషన్ అధ్యక్షులు రంగుముద్రి గణపతిరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిసి, ఇబిసిలకు స్వయం ఉపాధి పథకాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని దారిద్ర్య రేఖకు దిగువనున్న వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల్లోని పేదల అభివృద్ధికి స్వయం ఉపాధి పథకం కింద యూనిట్ల స్థాపన, జనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 21 నుంచి 60 ఏళ్ల వయసు ఉండి, దారిద్ర్యరేఖకు దిగువనున్న వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల్లోని పేదలు (ఈడబ్ల్యుఎస్ - కమ్మ, రెడ్డి, ఇబిసి, క్షత్రియ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ అభివృద్ధి కొరకు స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటుకు, డి-ఫార్మసీ, బి-ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత జెనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు 21 నుండి 50 ఏళ్ల మధ్య వయసు ఉన్న కాపు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి) కులాల వారికి సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలను అర్హత మేరకు కేటాయించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

బిసిల స్వయం ఉపాధి పథకంలో భాగంగా స్లాబ్-1, 2, 3 కింద 1221 యూనిట్ల స్థాపనకు లక్ష్యాలు నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఇందులో యూనిట్ విలువ రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలు ఉంటుందన్నారు. 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంక్ రుణంతో, గరిష్టంగా రూ.75 వేల నుంచి రూ.2లక్షలు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. వెనుకబడిన తరగతుల జెనరిక్ ఫార్మసీల ఏర్పాటు కొరకు యూనిట్ విలువ రూ.8 లక్షలు చొప్పున 25 యూనిట్ల ఏర్పాటుకు లక్ష్యం కాగా, అందులో ఒక్కో యూనిట్ విలువలో రూ.4 లక్షలు సబ్సిడీ, రూ.4 లక్షలు బ్యాంకు రుణం ఉంటుందని తెలిపారు.

అగ్రవర్ణాల్లోని పేదల స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా ఇబిసి 6 యూనిట్లు, బ్రాహ్మణులకు 5 యూనిట్లు, క్షత్రియ ఒక యూనిట్ వెరసి 12 యూనిట్లను స్థాపించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా జెనరిక్ ఫార్మసీలో ఇబిసి, బ్రాహ్మణులు ఒక్కో యూనిట్ చొప్పున రెండు యూనిట్ల ఏర్పాటుకు మొత్తం రూ.16 లక్షలు కేటాయించడం జరిగిందని వివరించారు. కాపు (కాపు, తెలగ, బలిజ మరియు ఒంటరి) కులాల వారికి స్వయం ఉపాధి పథకాలకు కేటాయించిన లక్ష్యాలను మూడు స్లాబ్లుగా విభజించడం జరిగిందన్నారు. మూడు స్లాబులకు 60 యూనిట్లకు రూ.2 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు స్థానిక సచివాలయాల్లో లేదా ఇంటర్నెట్ సెంటరులో అభ్యర్థి రేషన్ కార్డు, రైస్ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో ఈ నెల 10 నుండి 22 లోగా https://apobmms.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్‌ను పని దినాల్లో సంప్రదించాల్సిందిగా వివరించారు.

పి-4 సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పి4 సర్వే పూర్తిస్థాయిలో వేగవంతంగా జరగాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు సచివాలయం ఉద్యోగులకు సూచించారు. జియమ్మ వలస మండలం చినమేరంగి సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీలో జరుగుతున్న పి4 సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ పంచాయతీ లో 1069 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులు ఉండగా 229 మందిని మాత్రమే లబ్ధిదారులు గుర్తించడం సరైన పద్ధతి కాదన్నారు. సర్వే ఆలస్యం జరిగితే కలెక్టర్ సహించేంది లేదని కావున ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పి-4 సర్వేలో అంతా పాల్గొనాలని సూచించారు. అనంత రం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణ పరిశీలిం చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంబంగి రమేష్ ఉన్నారు.

వీరఘట్టం : పి- 4 సర్వేలో నిర్లక్ష్యం చూపితే సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని మండల ప్రత్యేక అధికారి కె.సాయికృష్ణ చైతన్య సిబ్బందిని హెచ్చరించారు. వీరఘట్టంలోని దుర్గపేటలో పి-4 సర్వే పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మీ మొబైల్‌కు వచ్చిన వివరాల ఆధారంగా సర్వే చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా సర్వే చేసి వారు డిజిటల్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు తప్ప మరి ఎవరు సహకరించట్లేదని మండల ప్రత్యేక దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి వ్యవసాయాధికారి, ట్రాన్స్కో ఎఇకి ఫోన్ చేసి సిబ్బంది సర్వేలో పాల్గొనలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, తక్షణమే సర్వేలో పాల్గొని సర్వే వివరాలు ఎంపిడిఒకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలంలోని వివిధ పథకాలతో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను మే 31లోగా పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ఎఇ ఎల్.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం అలమండ పంచాయతీ పరిధిలో గల నిడగల్లుగూడలో నిర్మించిన ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎంఎవై గ్రామీణ, పిఎం జన్మన్ పథకాల ఇళ్లను మే 31 నాటికి పూర్తి చేసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సాయంగా బిసి, ఎస్‌సిలకు రూ.50వేలు, ఎస్‌టి కులానికి రూ.75వేలు, పివిజిటి వారికి అదనంగా లక్ష రూపాయలు ఇవ్వనున్నారని అన్నారు. అలాగే కొత్తగా ఇళ్లు కావాల్సిన వారు పిఎంఎవై 2.0లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన వారు కుల, ఆదాయ, పొజిషన్, బ్యాంక్ అకౌంట్ ధ్రువ ప త్రాలను సమర్పించాలని ఆయన అన్నారు.

14న జనసేన ఆవిర్భావ సభ

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 14న పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబు, రాపాక మాధవరావు, జిటి నాయుడు కోరారు. మంగళవారం స్థానిక కళ్యాణమండపంలో చలో పిఠాపురం గోడపత్రికలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాల్లో జనసేన కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

చెత్త నుండి సంపద కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

చెత్త నుండి సంపద కేంద్ర తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సి ఉందని మండల ప్రత్యేక అధికారి ఓ ప్రభాకరరావు అన్నారు. మండలంలోని మరుపెంటలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయనతో పాటు ఎంపిపి ఉరిటి రామారావు పరిశీలించారు. ఈసందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయతీల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఎంపిపి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సేకరించిన చెత్తను నిర్మాణం చేపట్టిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల్లో వేయాల్సి ఉందని పేర్కొన్నారు.

పెరటి తోటలతో ఆరోగ్యం, అదనపు ఆదాయం

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు నీటిని నిల్వ చేసుకుని అత్యవసర సమయాల్లో పంటలకు వినియోగించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని దీనికోసం ఫారం పాండ్ ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో తప్పనిసరిగా నిర్మించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.మధుసూదనరావు అన్నారు. మండలంలోని కూనం బంధవలసలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజన రైతులు తప్పనిసరిగా పెరటి తోటలు, మిద్దె తోటలు పెంపకం చేపట్టాలని, వాటి ఉత్పత్తులను వినియోగించడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని, పెరటి తోటలు సాగు చేసి ఇంటి ఖర్చులను వెళ్లదీయవచ్చని తెలిపారు అలాగే ఏ పంటా పండని భూముల్లో నిమ్మగడ్డి సాగు ద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు. రైతులు ఏక పంట సాగు విధానాన్ని విడనాడి బహుళ పంటలు వేసుకోవడం ద్వారా చీడపీడలను అదుపులో ఉంచడమే కాకుండా మిత్ర పురుగుల వృద్ధి జరుగుతుందని, అనంతరం మహిళా గిరిజన రైతు దేవి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేస్తున్న పెరటి మిరప సాగును పరిశీలించారు. అనంతరం పి కొనవలసలో ప్రకృతి సేద్య సిబ్బంది ఆధ్వర్యంలో రైతు గోనాపు రామారావు నాటుతున్న ఎటిఎం కూరగాయల నమూనాను పరిశీలించారు. ఏడాది పొడవునా ప్రతిరోజూ ఆదాయాన్ని ఇచ్చేలా 20 సెంట్లు భూమిలో కూరగాయలు ఎటిఎం పద్ధతిలో సాగు చేసుకుంటే రోజువారి ఖర్చులు, ఇతర ప్రధాన పంటలకు అయ్యే ఖర్చులను వెల్లదీయవచ్చని ఈ నమూనాను మండలంలో విస్తృత పరచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, విఎఎలు అశ్విని, లావణ్య, ప్రకృతి సేద్య సిబ్బంది సురేష్, శ్రీను, కుమార్ పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని మరిపివలస, గుచ్చిమిలో మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులంతా రైతు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే నువ్వులు పంట గురించి మెలుకువలు తెలిపారు. వేసవిలో నువ్వుల పంట వేయడం వల్ల చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, ఈ పంట తక్కువ సమయంలో ఎక్కువ లాభాన్ని అందిస్తుంది అని, వేసవిలో ఆరుతడి పంటగా వేయడం వల్ల విత్తన నాణ్యతతో పాటు దిగుబడి కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, విఎఎలు పాల్గొన్నారు.